జనగామ జిల్లా రెవెన్యూ లైసెన్స్ సర్వేయర్ల సంఘం నూతన కమిటీ

జిల్లా రెవెన్యూ లైసెన్స్ సర్వేయర్ల సంఘం ఎన్నిక..

జనగామ, సెప్టెంబర్3(నమస్తే తెలంగాణ) : జనగామ జిల్లా రెవెన్యూ లైసెన్స్ సర్వేయర్ల సంఘం ఏర్పాటైంది. జిల్లా అధ్యక్షుడిగా బండ భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా ధరావత్ శ్రీను, ఉపాధ్యక్షులుగా బొల్లం సంపత్, కుమార స్వామి, కోశాధికారిగా సృజన్‌రాయ్, సహాయ కార్యదర్శి మట్ట యాదగిరి, సోషల్ మీడియా కన్వీనర్ ఆర్. కుమార్, సలహాదారులుగా రాజు, టాస్కిన్, కె.రాజన్, మల్లేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలి: డీపీవో

జఫర్‌గడ్, సెప్టెంబర్ 3: గ్రామాల్లో పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని డీపీవో స్వరూప అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో సుమన్ అధ్యక్షత వహించగా డీపీవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల కోసం సిద్ధంగా ఉండాలని అన్నారు. గ్రామాల్లో పన్నుల వసూళ్లు పూర్తి చేయా లని తెలిపారు. సీజనల్ వ్యాధులు, వర్షాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. మండల స్పెషలాఫీసర్ మనోహర్, ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతలపై దాడి పిరికిపందల చర్య

బచ్చన్నపేట, సెప్టెంబర్3: ఖమ్మం జిల్లాలో వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ గూండాలు దాడి చేసి రాళ్లు రువ్వడం పిరికిపందల చర్య అని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బోడిగం చెంద్రారెడ్డి అన్నారు. వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 3: జనగామ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏబీవీ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ నర్సయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్-2, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-1, ఫిజిక్స్-1 పోస్టులు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. సంబంధిత పీజీ కోర్సులో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత పొందిన వారు(ఎస్సీ, ఎస్టీలు 50 శాతం) 10వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 11వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ నర్సయ్య వెల్లడించారు.

ద్విచక్ర వాహనదారుడిపై కేసు నమోదు

చిల్పూరు, సెప్టెంబర్3: మండలంలోని చిన్నపెండ్యాల గ్రామశివారు జాతీయ రహదారిపై ఆగస్టు 30న రెండు ద్విచక్ర వాహనాలు ఎదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరిపై కేసు నమోదైంది. సోమయ్య రాంగ్‌రూట్‌లో వస్తూ శోభన్‌బాబు బైక్‌ను ఢీకొట్టడంతో అతడి భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. శోభన్‌బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ తెలిపారు.

బాణాపురంలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మించాలి

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 3: జనగామ పట్టణంలోని బాణాపురం 5వ వార్డులో సీసీ రోడ్డు, డ్రైనేజీలు నిర్మించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం వార్డులో నెలకొన్న సమస్యలపై సీపీ పట్టణ కమిటీ సభ్యురాలు పందిళ్ల కల్యాణి ఆధ్వర్యంలో ఇంటింటా సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య లోపంతో దోమల బెడద ఎక్కువగా ఉందన్నారు. విష జ్వరాలు వ్యాపించకుండా వెంటనే బ్లీచింగ్ పౌడర్ చల్లించడంతోపాటు దోమల మందు స్ప్రే చేయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు లింగం, మమత, శ్రీను, మహేందర్, ఉపేంద్ర, సువర్ణ, విజయ, సోమయ్య, రేణుక పాల్గొన్నారు.

పాలకుర్తి సీహెచ్‌సీ జనరల్ సర్జన్ సస్పెన్షన్

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 3: పాలకుర్తి సీహెచ్‌సీలో సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ (జనరల్ సర్జన్) డాక్టర్ వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తూ మంగళవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు. ఆగస్టు 4వ తేదీన ఉన్నతాధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరయ్యారు. విచారణలో విధుల్లో నిర్లక్ష్యం, క్రమశిక్షణరాహిత్యంగా వ్యవహరించారని తేలడంతో సస్పెన్షన్ వేటు పడింది.

టీపీటీఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

పాలకుర్తి,సెప్టెంబర్3: టీపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డీ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా ఏ దయాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పీ వెంకట్‌నర్సయ్య, కార్యదర్శులుగా ఎండీ షాహెి సుల్తానా, శ్రీనివాస్, బుచ్చయ్య, జిల్లా కౌన్సిలర్స్ ఈ అశోక్, ఎస్ శేషగిరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఇక్కడ ఫుల్.. అక్కడ నిల్

- స్టేషన్‌ఘన్‌పూర్ ఆస్పత్రిలో ఐదుగురు ఫార్మాసిస్టులు
- పలు మండలాల్లో ఒక్కరూ లేని వైనం
- విష జ్వరాలు ప్రబలుతున్నా పట్టింపేదీ?
- సర్దుబాటు చేయాలంటున్న సిబ్బంది, స్థానికులు

స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వాసుపత్రిలో పీహెచ్‌సీ పరిధిలోని విధులు నిర్వర్తిస్తున్న ఫార్మాసిస్టులు

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్3: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో ఐదుగురు ఫార్మాసిస్టులు ఉండగా, జిల్లాలోని పలు మండలాల్లో ఒక్కరూ లేక పేషెంట్లు, సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు. డివిజన్ కేంద్రంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్‌గా ఉన్నప్పుడు ఒకే ఫార్మాసిస్టు విధులు నిర్వర్తించేవారు. తర్వాత 30 పడకల ఆసుపత్రిగా మార్చగా ఔట్‌సోర్సింగ్ ద్వారా మరో ఇద్దరిని నియమించారు. కాగా ఇటీవల దాన్ని వంద పడకల దవాఖానగా అప్‌గ్రేడ్ చేయడంతో పీహెచ్‌సీ నుంచి రెగ్యులర్ ఫార్మాసిస్ట్‌తోపాటు వైద్య విధాన పరిషత్ ద్వారా గ్రేడ్ - 1, గ్రేడ్ - 2 ఫార్మాసిస్టులను కొత్తగా నియమించారు. దీంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మొత్తం ఐదుగురు ఫార్మాసిస్టులు విధులు నిర్వర్తిస్తున్నారు. కానీ జిల్లాలోని రఘునాథపల్లి, లింగాలఘనపురం, దేవరుప్పుల మండలాల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో ఒక్క ఫార్మాసిస్టూ లేడు. దీంతో విషజ్వరాలు, డెంగ్యూ వ్యాధి ప్రజలను వణికిస్తుంటే షేషెంట్లకు మందులు అందించడంతోపాటు కొరత ఉన్న మందులను తెప్పించడంలో ఆయా ఆసుపత్రుల సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా వైద్యాధికారి తగిన చర్యలు చేపట్టి స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న ఇద్దరు ఫార్మాసిస్టులను ఖాళీగా ఉన్న మండలాల్లో భర్తీ చేయాలని ఆయా హాస్పిటళ్ల సిబ్బంది కోరుతున్నారు. ఆ దవాఖానల్లో ఫార్మాసిస్టులను నియమిస్తే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యుల గైర్హాజరుపై ఎమ్మెల్యే ఆగ్రహం

- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫోన్

పాలకుర్తి రూరల్, సెప్టెంబర్3: ప్రభుత్వ దవాఖానలో గైర్హాజరైన వైద్యులపై పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం లారీ బస్సు ఢీకొన్న ఘటనలో ప్రమాద బాధితులను పరామర్శించేందుకు పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమండ్ల ఝాన్సీరెడ్డితో కలిసి మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు వచ్చారు. దవాఖానలో వైద్యులు లేకపోవడం, ఒక్కరే డాక్టర్ విధుల్లో ఉండడంతో ఎమ్మెల్యే మండిపడ్డారు. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు ఫోన్ చేసి గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విధుల్లో ఆలసత్వం వహించే వైద్యులు, సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. వైద్యుల నిర్లక్ష్యంగానే గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్యం అందడం లేదన్నారు. అనంతరం ప్రభుత్వ దవాఖా నలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్యే పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం నుంచి అందజేస్తామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర

ప్రభుత్వ దవాఖానలో హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

కార్యదర్శి మామిండ్ల రమేశ్ రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే వెంట డీసీసీబీ డైరెక్టర్ కాకిరాల హరిప్రసాద్‌రావు, బ్లాక్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి ఉన్నారు. గాయాలైన వారిని తాజా మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ నాయకుడు నల్లా నాగిరెడ్డి పరామర్శించారు.

విద్యార్థులకు వసతుల కల్పనలో అలసత్వం తగదు

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్
- మోడల్, కస్తూర్బా విద్యాలయాల తనిఖీ
- స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వాస్పత్రి సందర్శన

స్టేషన్‌ఘన్‌పూర్‌లో అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్/దేవరుప్పుల, సెప్టెంబర్3: విద్యార్థులకు వసతులు కల్పించడంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పింకేష్‌కుమార్ హెచ్చరించారు. స్టేషన్ ఘన్‌పూర్‌లోని మోడల్ స్కూల్ హాస్టల్, దేవరుప్పుల లోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. మోడల్ స్కూల్ హాస్టల్‌లో 25 మంది విద్యార్థులు ఉంటుండగా, కరెంటు , ఫ్యాన్స్, లైట్ల సమస్య ఉందని ఇన్‌చార్జి స్పెషల్ ఆఫీసర్ స్వప్న అధికారుల దృష్టికి తీసుకుపోగా, సమస్యలను తెలుసుకునేందుకు అడిషనల్ కలెక్టర్ వచ్చారు. విద్యుత్ శాఖ అధికారులు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి ఎస్టిమేషన్ వేసి పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జీసీడీవో గౌస్య, ఎంపీడీవో సదానందం, పంచాయతీ కార్యదర్శి జేసు మణి, ప్రిన్సిపాల్ కే శ్రీకాంత్, పీఆర్ ఏఈ రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కేజీబీవీలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో చేసిన పనులను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, వసతులు, స్టోర్‌లో ఉన్న నిత్యావసర వస్తువులను తనిఖీ చేశారు. భోజనం తిని ఉప్పు, కారం తగ్గించాలని సూచించారు. స్టోర్ రూంలో టాప్ పెచ్చులు ఊడడాన్ని చూసిన అదనపు కలెక్టర్ మరమ్మతులు చేయించాలని అక్కడే ఉన్న ఇంజినీరింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో రాము, జిల్లా బాలికా విద్యాధికారి గౌసియా బేగం, తహసీల్దార్ హుస్సేన్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, పీఆర్‌డీఈ రామలింగాచారి, సర్వ శిక్షా తెలంగాణ ఏఈ రమేశ్, ఎంపీవో సురేశ్‌కుమార్, ఉపాధిహామీ ఏపీవో శ్రీనివాస్, పీఆర్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కారుపోతుల సందీప్‌కుమార్, పాఠశాల ప్రత్యేక అధికారి సుకన్య తదితరులు ఉన్నారు

ప్రభుత్వాసుపత్రిలో వార్డుల పరిశీలన

స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ప్రభుత్వాసుపత్రిలోని వార్డులను అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్ పరిశీలించారు. ఆసుపత్రిని ఇటీవల కలెక్టర్ రిజ్వాన్ భాషా తనిఖీ చేసిన సమయంలో మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామంటూ పేషెంట్లు చెప్పిన నేపథ్యంలో మరుగుదొడ్లను పరిశీలించి, వాటి ఏర్పాటు కోసం ఎస్టిమేషన్ వేసి పంపించాలని అధికారులను ఆదేశించారు.

వరద బాధితులకు ఒకరోజు మూల వేతనం: టీజీఈజేఏసీ

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 3: వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు పునరావాసం కల్పించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ (టీజీఈజేఏసీ) ఒక రోజు మూల వేతన సహాయాన్ని ప్రకటించినట్లు జనగామ జిల్లా అధ్యక్షుడు ఖాజా షరీఫ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో టీజీజేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఖజా షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఉద్యోగులందరి తరపున ఒకరోజు మూల వేతనం రూ.130 కోట్లు విరాళంగా ఇస్తున్నామని పేర్కొన్నారు. టీజీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ కోర్నేలియస్, టీఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెల శ్రీనివాస్, టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు చంద్ర శేఖర్‌రావు, శ్రీనివాసరావు, పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్ రెడ్డి, ఎల్లారెడ్డి, టీపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మయ్య, రాజు, డీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు రాంరెడ్డి, చొక్కయ్య, రిటైర్డ్ ఎంప్లాయిస్ బాధ్యులు రామస్వామి, చొక్కయ్య, హరిబాబు, రాంనర్సయ్య, హఫీజ్, శ్రీనివాస్‌రెడ్డి, నాగార్జున పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించిన స్పెషలాఫీసర్

చిల్పూరు, సెప్టెంబర్3 : మండల కేంద్రంలోని వెంకటేశ్వరపల్లిలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షం ప్రభావానికి గ్రామంలోని శిథిలావస్థలో ఉన్న పులిగిల్ల ప్రేమలత, బట్టమేకల యాదమ్మలకు చెందిన రెండు పెంకుటిళ్లను మండల స్పెషల్ ఆఫీసర్ మాధవి లత గుర్తించి వారిని సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని సూ చించింది. అనంతరం అంగన్వాడీ సెంటర్లో పిల్లలకు అందజేస్తున్నా ఆహారాన్ని పరిశీలించింది. కార్యదర్శి పన్నీరు మధుసూదన్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

గీత కార్మికుడిని ఆదుకోవాలి

పాలకుర్తి,సెప్టెంబర్03: మండల కేంద్రంలో బండి ఆంజనేయులుగౌడ్ సోమవారం తాటిచెట్టు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి పడడంతో తీవ్రగాయాలు తగిలాయి.చికిత్స నిమిత్తం హన్మకొండ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన ఆంజనేయులుకు ప్రభుత్వం తక్షణమే ఆర్థికసాయం అందించి ఆ ఆదుకోవాలని స్థానిక గౌడ సంఘం నాయకులు కోరారు.

రఘునాథపల్లి: పోషణ మాసోత్సవంలో పాల్గొన్న డీడబ్ల్యూవో జయంతి, దేవరుప్పుల: చినమడూరు అంగన్‌వాడీలో చిన్నారులకు కథలు చెబుతున్న సూపర్‌వైజర్

చిన్నారులకు ఆటపాటలతో విద్యనందించాలి

- డీడబ్ల్యూవో జయంతి
- అంగన్‌వాడీ సెంటర్లలో ఘనంగా పోషణ్ మాసోత్సవం

రఘునాథపల్లి సెప్టెంబర్3: అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారులకు ఆటపాటలతో విద్యనందించాలని డీడబ్ల్యూవో జయంతి అన్నారు. మండలంలోని కోమాల్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయంతి చిన్నారుల హాజరు శాతం, స్టాక్ రిజిస్టార్‌ను పరిశీలించి మెనూ ప్రకారం చిన్నారులకు అందించాల్సిన పౌష్టికాహారం అందిస్తున్నారా? లేదా అని అంగన్‌వాడీ టీచర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలపై తల్లులకు అవగాహన కల్పించి, చిన్నారుల సంఖ్యను పెంచేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎండీ నసీముున్నిసా, అంగన్‌వాడీ టీచర్స్ ఎండీ ఫాతీమాబేగం, బొల్లపల్లి ప్రేమలత, సుప్రియ, చిన్నారులు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీలకు పంపించాలి

బచ్చన్నపేట: మూడేళ్లు లోపు ఉన్న పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని గోపాల్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి మోకు కవిత అన్నారు. పోషణ్ మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులు, తల్లులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నామ న్నారు. సూపర్‌వైజర్ మనోహర మాట్లాడుతూ కేంద్రాల్లో పిల్లల హాజరుశాతం మరింత పెంచాలన్నారు. కార్యక్రమంలో టీచర్లు పస్తం లక్ష్మి, పర్వతం భాగ్యలక్ష్మి, ఆయాలు అంబవ్వ, యాదలక్ష్మి పాల్గొన్నారు.

ఆటపాటలతో ఆనంద పర్చాలి

లింగాలఘణపురం: అంగన్వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో చిన్నారులకు పూర్వ విద్యనందిసున్నామని సీడీపీవో రమాదేవి అన్నారు. బండ్లగూడలోని రైతు వేదిక భవనంలో మంగళవారం జరిగిన అంగన్వాడీ టీచర్ల మండలస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల ప్రాధాన్యతను వివరించేందుకు 3వ తేదీ నుంచి పోషణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, హౌస్ అమ్మ పుష్ప పాలొన్నారు.

లబ్ధిదారులతో అభ్యసనం

స్టేషన్ ఘన్‌పూర్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులతో వివిధ పుస్తకాలను చదివించినట్లు సీడీపీవో ఫ్లోరెన్స్ తెలిపారు. మంగళవారం రీడ్ ఏ థాన్ కార్యక్రమంలో భాగంగా బాలింతలు, గర్భి ణులు, పిల్లల తల్లిదండ్రులతో వివిధ పుస్తకాలు చదివించామని సీడీపీవో తెలిపారు. మండలంలోని తాటికొండ అంగన్‌వాడీ 2వ సెంటర్‌లో జరిగిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ ధనలక్ష్మి, సూపర్‌వైజర్ సంధ్యారాణి, మెడికల్ ఆఫీసర్ జ్యోతి, ఆయా యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కథలపై ఆసక్తి కలిగించాలి

దేవరుప్పుల: విద్యార్థులకు కథలు, బొమ్మలపై ఆసక్తి పెంచితే చిన్నతనం నుంచే విజ్ఞానంతో పాటు, చురుకుతనం అలవడుతుందని ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి అన్నారు. చినమడూరు అంగన్వాడీ సెంటర్‌లో రీడ్ ఏ థాన్ ప్రోగ్రామ్‌లో ఆమె పాల్గొని హావభావాలతో పిల్లలకు కథలు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సెంటర్లో చేరిన బాలబాలికలు ఐదేళ్లలో పూర్తిస్థాయిలో ఆరోగ్యం, విజ్ఞానం కలిగి ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో అంగన్వా డీ టీచర్లు హైమావతి,నర్సమ్మ, లలిత ఉన్నారు

కరువు తీరా వానలు..

- నిండుకుండలా గండిరామారం.. మిగిలిన రిజర్వాయర్లు సగమే
- పొంగుతున్న వాగులు, వంకలు.. నిండిన 227 చెరువులు, కుంటలు

జనగామ, సెప్టెంబర్ 3(నమస్తే తెలంగాణ): ఈ సీజన్‌లో ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో ఎగువప్రాంతమైన జనగామ జిల్లాలో భూగర్భజల మట్టాలు గణనీయంగా పెరిగాయి. జూన్‌లో మోస్తరు వానలు కురియగా, జూలై, ఆగస్టు మొదటి ఐదురోజుల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. సెప్టెంబర్ 1న సాధారణం కంటే 354 మిల్లిమీటర్ల వర్షపాతం కురియగా, చీటకోడూరు, మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు సామర్థ్యం మేరకు పూర్తిస్థాయిలో నిండాయి. జిల్లాలోని 965 పెద్ద, చిన్న చెరువులకు గాను 68 నీటి వనరులు 25 నుంచి 50 శాతం, 136 చెరువులు, కుంటలు 50 నుంచి 75శాతం, 338 చెరువులు 75 నుంచి 100శాతం, 227 నీటి వనరుల్లోకి అదనపు (మిగులు) నీరు చేరి మత్తడి పోస్తున్నాయి. ఒక్క గండిరామవరం రిజర్వాయర్ మాత్రమే 90 శాతం నిండి నీటితో కళకళలాడుతుండగా, నవాబ్‌పేట రిజర్వాయర్‌లో మాత్రం 23.71 శాతం నీరు చేరితే మిగతా రిజర్వాయర్లలో 60శాతంకు పైగా నీళ్లు చేరాయి. నీటి వనరులు పుష్కలంగా అందుబాటులో ఉండడంతో వానకాలంతోపాటు వచ్చే యాసంగి సాగు, తాగునీటికి ఢోకా ఉండదని అధికారులు అంటున్నారు. కాగా, జిల్లాలో ఇటీవల కురిసిన భారీవర్షాలకు 278 ఎకరాల్లో వరి పత్తి పంటలు దెబ్బతిన్నాయి. రెండు కుంటలకు గండిపడగా, ఆరు చోట్ల రోడ్లు, 12ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

రిజర్వాయర్లలో నీటి మట్టం (అడుగుల్లో)

రిజర్వాయర్	సామర్థ్యం	ప్రస్తుతం	శాతం
గండిరామారం	400.000	361.746	90.44
బొమ్మకూరు	198.000	129.600	65.45
చీటకోడూరు	300.258	155.659	51.84
నవాబ్‌పేట	550.51	130.500	23.71
ఆర్ఎస్ ఘన్‌పూర్	1570.000	1005.000	64.01
అశ్వరావుపల్లి	740.000	505.000	68.24

మట్టి గణపతి ప్రతిమల ప్రచార వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మట్టి గణపతి ప్రతిమలనే పూజించాలి: కలెక్టర్

జనగామ చౌరస్తా, సెప్టెంబర్ 3: వినాయక చవితి పర్వదినం సందర్భంగా మట్టి గణపతి ప్రతిమలనే పూజించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతులనే పూజిద్దామంటూ రూపొందించిన ప్రచార సందేశ వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ, రసాయన రంగులతో తయారు చేసిన గణపతి విగ్రహాలతో జల వనరులు, జీవరాశులు కాలుష్యం అవుతాయని తెలిపారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లాలో 2 వేల మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ, కాలుష్య నియంత్రణ మండలి జిల్లా అధికారి ఆర్ సునీత, ఫారెస్ట్ రేంజ్ అధికారి కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి: కలెక్టర్

నేషనల్ అచీవ్ మెంట్ సర్వే(ఎన్ఏఎస్) 2024 పరీక్షలో విద్యా ర్థుల ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులతో కలిసి ఎన్ఏఎస్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అభ్యసనా సామర్థ్యాలపై పట్టు సాధించడానికి ఎన్ఏఎస్ ప్రతిభ పరీక్ష ఉపయో గపడుతుందన్నారు. 3, 6, 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల ప్రగతిని మదింపు చేయడానికి ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్, డీఈవో రాము, అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్, అన్ని సబ్జెక్టుల రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

కూలిన ఇంటిపై కప్పు

దేవరుప్పుల, సెప్టెంబర్3: కడవెండి చేనేత కార్మికుడు నల్ల అశోక్‌కు చెందిన ఇల్లుపైకప్పు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూలింది. దీంతో మగ్గంపై పెంకలు పడడంతో అది ధ్వంసమైందని బాధితుడు తెలిపాడు. రెక్కాతేగాని డొక్కాడని తనకు ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయాలని కోరాడు.

సమస్యలు తీర్చేందుకే పాలంబాట: డీఈ

రఘునాథపల్లి, సెప్టెంబర్3: వ్యవసాయానికి విద్యుత్ సమస్యలు తీర్చేందుకే తాము పొలంబాట చేపట్టామని విద్యుత్ డీఈ లక్ష్మీ నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని వడిచెర్ల, వనపర్తి గ్రామాల్లో మంగళవారం సిబ్బందితో కలిసి వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీ అనిల్ కుమార్, ఏఈ శంకరయ్య, లైన్ ఇన్‌స్పెక్టర్ నరసింహస్వామి లైన్ మెన్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

గృహావసరాల కోసం రూ. 825కు విద్యుత్ మీటర్

స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్3: గృహావసరాల కోసం రూ. 825కు విద్యుత్ మీటర్ అందిస్తున్నామని ఆ శాఖ ఎస్ఈ వేణుమాధవ్